www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -85 గురువారం 9 జూలై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి



- ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు
- అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు
- బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు

**టెహ్రాన్, జూలై 8(ప్రజావినికిడి):** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది.హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు**మిగతా 2లో...**

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ తనిఖీలు




**న్యూఢిల్లీ జూలై 8(ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం భారీగా సోదాలు చేపట్టారు. ఐసీస్ , ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. **మిగతా 2లో...**

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

- దక్షణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన
- హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో లోకేశ్ సమావేశం
- కుప్పంలో ఫుట్‌వేట్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమకు ఓకే



**అమరావతి, జూలై 8 (ప్రజావినికిడి):** దక్షిణ కొరియా బుసాన్‌లో హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఏపీలో హ్యోసంగ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆహ్వానం పలికారు. కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ , మెటీరియల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు. ఏపీలో నెక్స్ట్‌జెన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్అండ్‌డీ, **మిగతా 2లో...**

# మీరు ఇవ్వలేదు..

## మేమే కొట్లాడి తెచ్చుకున్నాం


- .. కిషన్ రెడ్డిపై భట్టి ఫైర్
- కొత్త కేటాయింపు కాదన్న డిప్యూటీ సీఎం
- 2013లోనే యూపీఏ సింగరేణికి కేటాయించిందని వెల్లడి
- మైనింగ్ లీజు అనుమతులు ఆలస్యమయ్యాయని విమర్శ
- అన్ని సింగరేణి గనులు సంస్థకే ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్, జూలై 8 (ప్రజావినికిడి):** సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధన**మిగతా 2లో...**



# ఉచిత పథకాలు ఎవరడిగారు?

: తెలంగాణ సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం



**హైదరాబాద్, జూలై 8 (ప్రజావినికిడి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టు తీవ్ర సందేహాలను వ్యక్తం చేసింది. శాసనసభ ఆమోదం **మిగతా 2లో...**



# పెట్టుబడులపై ఆసక్తి

## సిఎం రేవంత్‌రెడ్డి తో కెనడా బృందం భేటీ

**హైదరాబాద్, జూలై 8(ప్రజావినికిడి):** కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు.**మిగతా 2లో...**

# వైఎస్సార్ 77వ జయంతి..

- ఇడుపులపాయలో నివాళి అర్పించిన జగన్, విజయమ్మ
- వైఎస్సార్ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన వైసీపీ శ్రేణులు
- ఇడుపులపాయలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జగన్, విజయమ్మ, భారతి
- హాజరైన వైసీపీ నేతలు, అభిమానులు

**ఇడుపులపాయ, జూలై 8(ప్రజావినికిడి):** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో వైసీపీ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని**మిగతా 2లో...**



# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో ఫైర్ అయిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,జూలై 8 (ప్రజావినికిడి):** :గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ **మిగతా 2లో...**



# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

**మొదటిపేజీ తరువాయి**

చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷–గ్గ్÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ–9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు. ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

**మొదటిపేజీ తరువాయి**

ఆసియా–పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కుప్పం కేంద్రంగా దక్షిణ భారత సమగ్ర ఫుట్‌వేర్ తయారీ క్లస్టర్‌కు ప్రతిపాదన చేశారు. తిరుపతిలో విడిభాగాల తయారీ, విశాఖపట్నంలో డిజైన్, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏపీలో టైర్–1, టైర్–2 వెండర్లతో సప్లయర్ మీట్ నిర్వహించాలని హ్వాసంగ్‌కు ఆహ్వానం పలికారు. కుప్పంలో రూ.900 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ నాన్ – లెదర్ ఫుట్‌వేర్ ఎ÷–లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు. ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూల తయారీ లక్ష్యంగా హ్వాసంగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనుందని ప్రతినిధులు వివరించారు. అడిడాస్ సహా గ్లోబల్ బ్రాండ్లకు క్షఇఓ సరఫరాదారుగా హ్వాసంగ్ ఉండనుందని వెల్లడించారు. తొలి దశలో ఎగుమతులు.. ఆపై దేశీయ మార్కెట్‌పై దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు. అలాగే బుసాన్‌లోని షూఆల్స్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని మంత్రి లోకేశ్ సందర్శించారు. అధునాతన టెక్నాలజీతో బూట్ల తయారీ ప్రక్రియను పరిశీలించారు. మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, స్మార్ట్ చిప్‌లతో తయారయ్యే షూస్‌పై ఆసక్తి కనపరించారు. పాదాల ఆరోగ్యానికి ప్రత్యేక వైబ్రేషన్ చిప్ టెక్నాలజీని లోకేశ్ పరిశీలించారు. రక్తప్రసరణ మెరుగుదల, కండరాల అలసట తగ్గించే స్మార్ట్ ఫుట్‌వేర్ తయారీ గురించి ఆయన తెలుసుకున్నారు. 'పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈవో , ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ ,ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో బుసాన్‌లో సమావేశ మయ్యాను. ఆంధ్రప్రదేశ్‌లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. సింగిల్ విండో విధానంలో అనుమతులతోపాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ సిద్ధంగా ఉన్నాయని వివరించాను' అని లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి**

ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులు తున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చన్నారు. సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు. మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్‌ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతులుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు. 'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

# మీరు ఇవ్వలేదు.. మేమే కొట్లాడి తెచ్చుకున్నాం

**మొదటిపేజీ తరువాయి**

ల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ –2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తాడిచెర్ల–2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ముందుంచారు. 2021 లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు ఆమోదం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటి వరకు ÷ళ్లైను పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా ఇలా ఆపడం సరికాదని తానే స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చి లో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, ఈ బ్లాక్‌కు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. ఆ తర్వాత స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు ఇవ్వకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి, ఎప్పుడో ఉన్నదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022 లో కోయగూడెంలోని బ్లాక్–3 ని కేంద్రం వేలంలో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అలా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన ఆ బ్లాక్.. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. చట్టప్రకారం కోయగూడెం బ్లాక్–3 తో పాటు సత్తుపల్లి బ్లాక్–3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయ కుండా నష్టం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరి మార్చుకుని, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న కోల్ బ్లాకులను, అలాగే తెలంగాణలోని అన్ని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు.

# ఉచిత పథకాలు ఎవరడిగారు?

**మొదటిపేజీ తరువాయి**

లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోల) ద్వారా ఈ పథకాలను ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పథకాలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ బుధవారం విచారించారు. చట్టసభ ఆమోదం లేకుండా ప్రజాధనాన్ని పంపిణీ చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246లకు విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఈ పథకాలకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలను రద్దు చేయాలని కోరారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఉద్యోగులకు జీతాలు ఆలస్యమవుతున్నాయి, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణ పరిహారం వంటివి పెండింగ్‌లో ఉన్నాయి, నిధుల కోసం ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారు. మరోవైపు రాష్ట్రం అప్పుల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు ఉంటే ఉచితాలు ఇవ్వవచ్చని, కానీ చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ఇప్పటివరకు రూ.13,484 కోట్లు ఖర్చు చేశారని, కాగ్ నివేదికల ప్రకారం సుమారు రూ.90 కోట్లు అనర్హులకు అందాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ తరపున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం, నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. అయితే, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.

# పెట్టుబడులపై ఆసక్తి

**మొదటిపేజీ తరువాయి**

ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. నిలి గిల్బర్ట్, మహేశ్ కొండూరు అమిత్ మెహ్రా ,దిలెక్ , థామస్ ఫ్రోలిక్, సెంథిల్ తొండమాన్, సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

# వైఎస్సార్ 77వ జయంతి..

**మొదటిపేజీ తరువాయి**

వైసీపీ అధినేత జగన్ కడప జిల్లా ఇడుపులపాయకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి, అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం తన తండ్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు వైసీపీకి చెందిన ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై అంజలి ఘటించారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు.

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసీస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

# గోద్రెజ్ ఆధ్వర్యంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

## ఖమ్మం జిల్లాలో ఏర్పాటుపై సిఎంతో చర్చలు


## రేవంత్‌తో భేటీ అయిన గోద్రెజ్ ప్రతినిధులు

**హైదరాబాద్, జూలై 8 (ప్రజావినికిడి)::** తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. కమ్మం జిల్లాలో ఏర్పాటు కానున్న దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రెజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బుధవారం కలిశారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గా÷–డ్గ్÷న్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గా÷–డ్గ్÷న్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# నేడు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి జెపి నడ్డా

## ఎయిమ్స్‌పై సమీక్షించనున్న మంత్రి

**హైదరాబాద్, జూలై 8(ప్రజావినికిడి):**



కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం తెలంగాణలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. గురువారం ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీనగర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. రేపు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌నకు వెళ్లనున్నారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.

------------

# ఆ భూముల్లో నిజాలు నిగ్గు తేల్చాల్సిందే..!

**షాద్ నగర్ బిఆర్ఎస్ నేత వై.రవీందర్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు..**

**సిద్ధాపూర్ భూముల అవకతవకలపై ఏ కమిషన్ తోనైనా విచారణ జరపండి..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** సిద్ధాపూర్ భూముల పరిహారం విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న అధికార, విపక్షాలపై షాద్ నగర్ ప్రతిపక్ష నేత, బిఆర్ఎస్ నాయకుడు వై రవీందర్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక రౌండ్ టేబుల్ సమావేశానికి రవీందర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతున్న సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిద్ధాపూర్ ఉద్యమాన్ని నీరుగార్చే విధంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడే విధంగా సిద్ధాపూర్ భూముల అక్రమాలపై హెచ్చరికలు చేస్తున్నారని గత రెండేళ్లు అధికారంలో ఉండి టిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీల మధ్య చదవకుండా ఏదైనా ఒప్పందం జరిగిందా? ఎందుకు విచారణ జరపలేదని ఇప్పుడే ఎందుకు మాట్లాడుతున్నారని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో బిఆర్ఎస్ నేత వై రవీందర్ యాదవ్ తన ప్రసంగం సమయంలో ఈ అంశాన్ని ఆయన కూడా స్పందించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

సిద్ధాపూర్ భూముల అవకతలపై అటు అధికార విపక్ష పార్టీల నాయకులు ఏవేవో అసంబంధ మాట్లాడుతున్నారని ఖచ్చితంగా సిద్ధపూర్ భూముల అవకతవకల గూర్చి ఏ కమిషన్ తో విచారణ చేయించిన బిఆర్ఎస్ స్వాగతిస్తుందని అన్నారు. నిజా నిజాలు ఈ అంశంపై నిగ్గు తేల్చాల్సిందే అని అన్నారు. భూముల అక్రమాల వ్యవహారంలో తప్పులు చేసిన వారిని శిక్షించాల్సిందేనని రవీందర్ యాదవ్ తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే సిద్ధాపూర్ లో బ్రహ్మాండమైన ఐటీ పార్క్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ వచ్చేవని అన్నారు. సిద్ధాపూర్ ఉద్యమానికి ప్రజాసంఘాలు ఇంకా ఎవరు ముందుకు వచ్చిన వారి వెంట నడవడానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని, అవసరమైతే కేటీఆర్ హరీష్ రావు కూడా వచ్చి సిద్ధపూర్ రైతుల పక్షాన నిలబడతారని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 2014 సంవత్సరానికి ముందే కొత్తూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు వచ్చాయని అన్నారు.

# కోర్టు స్టే అండతో నడుస్తున్న రెజోనెన్స్ స్కూల్..

**అనుమతులు లేకున్నా విద్యార్థులతో తరగతులు..**

**డీఈఓ,ఆర్జేడీ ఈ నోటీసులు బేఖాతరు, అధికారుల ఆదేశాలకు విలువ లేదా.?**

**విద్యార్థుల జీవితాలతో గెలగాటం ఆడుతున్న రిజోనెన్స్ స్కూల్ యాజమాన్యం..**

**పారిశ్రామిక వార్డులో అనుమతులు లేకుండా స్కూలు నిర్వహణ..**

**స్కూలును వెంటనే తొలగించి యజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఫైర్ బ్రాండ్ జర్నలిస్టుల విన్నపం..**



**నాచారం, (ప్రజావినికిడి): (ప్రతినిధి),** నాచారం పారిశ్రామిక వాడలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో రెజోనెన్స్ పాఠశాల నిర్వహణ కొనసాగుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ అనుమతులు లేకుండా పాఠశాలను నడిపిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న యాజమాన్యం, అధికారుల చర్యలను అడ్డుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకుందన్న ప్రచారం విద్యావర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.అధికారిక సమాచారం ప్రకారం,రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్జేడీఈ) సంబంధిత వ్యవహారంపై స్పీకింగ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, పారిశ్రామిక ప్రాంతంలో విద్యాసంస్థ నిర్వహణకు అవసరమైన అనుమతులు లేవని కూడా స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), ఆర్జేడీ ఈ కార్యాలయాలు పాఠశాలను వెంటనే మూసివేయాలని నోటీసులు జారీ చేసినప్పటికీ, యాజమాన్యం వాటిని లెక్కచేయకుండా యథావిధిగా తరగతులు కొనసాగించడం అధికార వ్యవస్థనే సవాల్ చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ నిబంధనలను పక్కనబెట్టి కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో పాఠశాల నిర్వహించడమే కాకుండా అధికారులను కోర్టుల వరకు లాగేంత రాజకీయ పలుకుబడి ఎవరి అండతో లభించిందనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానమే అయితే ఒక విద్యాసంస్థ మాత్రం నోటీసులను బేఖాతరు చేస్తూ ఎలా కొనసాగుతోందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే ఈ అక్రమాలపై ప్రశ్నిస్తున్న జర్నలిస్టులు ను సైతం యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రయోజన అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్న విలేకరులను భయపెట్టే ప్రయత్నాలు అత్యంత ఖండనీయమని జర్నలిస్టు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

ఇప్పటికైనా విద్యాశాఖ,జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి,కోర్టు ముందు పూర్తి ఆధారాలను సమర్పించి స్టేను రద్దు చేయించేందుకు చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని పాఠశాలను వెంటనే మూసివేసి, నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యంపై తగిన చట్టపరమైన కేసులు నమోదు చేయాలని ఫైర్‌బ్రాండ్ రిపోర్టర్లు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయాలు, పలుకుబడులు, న్యాయపోరాటాల మధ్య బలికాకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని న్యాయం చేయాల్సిన అవసరం ఉందని ఫైర్ బ్రాండ్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

**రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన**

**నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం**

**ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



**నాగర్‌కర్నూల్,జూలై8(ఆర్ఎన్ఎ):** రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు.

## అలనాటి జ్ఞాపకాలలో
# వైఎస్సార్‌తో అరుదైన ఫోటో..

**జయంతి సందర్భంగా పంచుకున్న కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి**

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీమంత్రి శంకర్ రావు, స్థానిక నేతలు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయనతో దిగిన అరుదైన పాత ఫోటోను షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకుడు, చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి మీడియాతో పంచుకున్నారు.

ఈ అరుదైన చిత్రంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు ప్రస్తుత షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ మంత్రి డాక్టర్ పి. శంకర్ రావు, చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి, యువ నేత దంగు శ్రీనివాస్ యాదవ్, పటోళ్ల వెంకటేశ్వర రెడ్డి,మైనార్టీ నాయకుడు అసద్ ముక్తార్ అలీ తదితరులు కనిపిస్తున్నారు.

వైఎస్సార్‌తో గడిపిన ఆ క్షణాలు తమకు చిరస్మరణీయమైనవని,ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత,సంక్షేమ పాలన నేటికీ స్ఫూర్తిదాయకమని సర్పంచ్ రవీందర్ రెడ్డి తెలిపారు.ఆయన జయంతి సందర్భంగా ఈ ఫోటోను అలనాటి మధుర జ్ఞాపకంగా ప్రజలతో పంచుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

వైఎస్సార్ జయంతి కవితను సర్పంచ్ రవీందర్ రెడ్డి మీడియాతో పంచుకున్నారు.

### "ప్రజల గుండెల్లో చిరస్థాయి"

*మట్టి మనిషివై.. మనసులు గెలిచిన మహానేతవు..*
*మాట ఇచ్చి నిలబెట్టిన నాయకత్వానికి నీవే చిరునామా..*
*రైతు కన్నీటికి ధైర్యమై..*
*పేదింటి దీపానికి వెలుగై..*
*ప్రతి గుండెలో ఆశల విత్తనం నాటిన నాయకుడివి నీవే..*
*పదవులు శాశ్వతం కావు..*
*ప్రజల ప్రేమే చిరంజీవి..*
*ఆ ప్రేమలో నీవు నిత్యం సజీవం..*
*నీ అడుగుజాడల్లో నడిచే సేవే నిజమైన నివాళి..*
*నీ ఆశయాలే తరాలకు మార్గదర్శకం..*
*ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి జయంతి నివాళులు.*

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే వరకు బీఆర్ఎస్ మద్దతు




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే వరకు సంస్థ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని మాజీమంత్రి, అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్టీసీ డ్రైవర్ కోళ్ళ శంకర్ గౌడ్ సంస్మరణ సభకు హాజరైనారు. ముందుగా ఆయన శంకర్ గౌడ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు సంఘం ఆధ్వర్యంలో లక్ష రూపాయలు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యక్తిగతంగా లక్ష రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ లోని వేలాదిమంది కార్మికులకు తన బలిదానంతో నైనా మేలు జరుగుతుందన్న ఆలోచనతో శంకర్ గౌడ్ చేసిన ప్రాణత్యాగం ఆర్టీసీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. 32 డిమాండ్ లతో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేపట్టగా, శంకర్ గౌడ్ మృతితో ప్రభుత్వం దిగొచ్చి చర్చలకు పిలిచి హామీలు అమలు చేస్తామని చెప్పడంతో సమ్మెను విరమించారని గుర్తు చేశారు. అనంతరం బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ ఎన్నికలు ముగిసిన తర్వాతే ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించడం మరోసారి ఆర్టీసీ ఉద్యోగులను మోసగించడమేనని ఆరోపించారు. యూనియన్ ఎన్నికలు జరగడానికి, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వంలో విలీనం చేయాలనేది శంకర్ గౌడ్ చివరి కోరిక అని,అది నెరవేరే వరకు తెలంగాణ ఉద్యమ స్పూర్తితో ఉద్యోగులు ఐక్యతతో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ బిసి ఆర్టీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్,రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, సికింద్రాబాద్ జోన్ గౌరవ అధ్యక్షుడు సాదం బాలరాజ్ యాదవ్,శంకర్ గౌడ్ సతీమణి హేమలత, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సఖి మహిళా మండలి పేరిట 2 కోట్లకు పైగా కుచ్చుటోపి



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** సఖి మహిళా మండలి, టిఆర్ఎస్(డి), ఉద్యమకారుల వేదిక అనే సంస్థలను తెలంగాణ రక్షణ సమితి (టిఆర్ఎస్ (డి) వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ ఏర్పాటు చేసి, వివిధ కార్యక్రమాల పేరిట వందలాది మంది దగ్గర రూ. 2 కోట్లకు పైగా వసూలు చేసి మోసం చేశారని బాధితులు పట్నాల సావిత్రి, తోలేటి శంకర్ గౌడ్, కంచర్ల మంజూష, పూనెం సీత ఆరోపించారు. ఆయనకు డబ్బులిచ్చినట్టు తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని స్పష్టంచేశారు. బుధవారం హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ వారు మాట్లాడారు. తమ పార్టీ ద్వారా ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తామని కొంతమందిని నమ్మించి,లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. సఖి ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి,గవర్నర్ చేత అవార్డులిప్పిస్తానని డబ్బులు వసూలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులను కూడా వదల్లేదని తెలిపారు. 15 రోజుల్లోపు తమ డబ్బులు తమకు ఇవ్వకపోతే సత్యనారాయణపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో బాధితులు కొమురం సరస్వతి,డాక్టర్ ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఈదురు గాలులకు చెట్టు విరిగి కారు ఆటో ధ్వంసం

**:వెంటనే స్పందించిన బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి**



**చైతన్యపురి, జూలై,8 (ప్రజా వినికిడి):** ద్వారకాపురం రోడ్ నంబర్ 7ఎ లో ఈదురు గాలులకు చెట్టు విరిగి పడడంతో అక్కడే చెట్టుకింద ఉన్న ఒక కార్,ఆటో పై చెట్టుకొమ్మలు పడడంతో కార్ ఆటో డామేజ్ అవ్వడం జరిగింది.కాలనీ వాళ్ళు ఈ విషయం చైతన్యపురి బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డికి తెలుపడంతో వెంటనే డి ఆర్ ఎఫ్ సిబ్బందికి యూ బి డి సెక్షన్ అజయ్ కి కాల్ చేసి రప్పించి చెట్టు కొమ్మలు తొలగించి వాహనాలు బయటకి తీయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్, శ్రీనివాస్,అజయ్, రమేష్,జలంధర్, రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఆర్డీఎస్ వద్ద అక్రమ నిర్మాణాలపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన..

**ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నేతలతో పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**







**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఆర్డీఎస్ వద్ద కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు చేపడుతున్నట్లు అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్,లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,వెంకట్ రామ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి,జైపాల్ యాదవ్,అంజయ్య యాదవ్,రామ్ మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అర్ ఎస్ ప్రవీణ్ కుమార్,విజయ్ కుమార్,ఆంజనేయులు,రాజేశ్వర్ తో పాటు షాద్ నగర్ బీఆర్ఎస్ నాయకులు రామక్రిష్ణ,భూపాల్ రెడ్డి,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,నాగిళ్ళ వెంకటేష్,బాబురావు,భైర్కాని శివ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ,ఈ నిర్మాణాల వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని అన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీటి హక్కులు దెబ్బతింటాయని, రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలకు తాగునీరు,సాగునీటి పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగిన శ్రద్ధ చూపడం లేదని లెఫ్ట్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీటి సరఫరా దెబ్బతిని నడిగడ్డ ప్రాంతంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందక రైతులు నష్టపోయే పరిస్థితితో పాటు భూగర్భ జలాలపై ఆధారపడాల్సి రావడంతో బోర్లు ఎండిపోయే ప్రమాదం ఏర్పడుతుందని, వ్యవసాయ దిగుబడులు తగ్గి రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని,రాష్ట్ర జల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా నిలచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రూ.5 లక్షల తక్షణ సాయం చెక్కును అందజేసిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి**




**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, గట్టుప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,ఎదుల శంకర్ (శ్రీకాంత్) మిడ్జిల్ బహిరంగ సభలో అస్వస్థతకు గురై దురదృష్టవశాత్తు తర్వాతి రోజు మృతి చెందారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రాగానే కార్యకర్త కుటుంబానికి పార్టీకి అండగా నిలవాలని వారి కుటుంబాన్ని కలిసి ధైర్యాన్ని ఇవ్వాలని మంత్రి పొంగులేటి కి సూచించారు. వనపర్తి జిల్లా పర్యటన ముగించుకుని వస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,శంకర్ (శ్రీకాంత్) స్వగ్రామం అయిన గట్టుప్పలపల్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి, శంకర్ (శ్రీకాంత్) చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి తక్షణ సాయంగా రూ.5 లక్షల చెక్కును కుటుంబసభ్యులకు అందించారు. భవిష్యత్ లో ఆ కుటుంబానికి కావాల్సిన ఏ విషయంలోనైనా, అన్నివేళల అండగా ఉండేలా కాంగ్రెస్ పార్టీ ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటుదని, మంత్రులు కుటుంబసభ్యులకు మనో ధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు,శంకర్ (శ్రీకాంత్) అభిమానులు గ్రామ ప్రజలందరు బాధాతప్తహృదయంతో పాల్గొన్నారు.

# మళ్లీ విజృంభిస్తున్న అక్రమ రేషన్ బియ్యం మాఫియా..

**సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక దాడులకు స్థానికుల డిమాండ్..**

**డీఎస్పీ వెంకటేశం దాడుల తర్వాత తగ్గిన దందా.. - ఇప్పుడు మళ్లీ పుంజుకున్న మాఫియా..**

**పోలీసుల నిర్లక్ష్యంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదన్న విమర్శలు..**







**హైదరాబాద్,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో అక్రమ రేషన్ బియ్యం దందా మరోసారి తలెత్తుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద అంబర్‌పేట్, ఇంజాపూర్, తుర్కయంజాల్, ఎల్బీనగర్ , హయత్‌నగర్, చంపాపేట్, బడంగ్‌పేట్, గోల్కొండ, అమంగల్, మంగళపల్లి (బొంగులూరు గేట్) ప్రాంతాల్లో భారీ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు,నిల్వ, రవాణా జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై ప్రత్యేక సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ బృందాలు తక్షణమే దాడులు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గతంలో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వెంకటేశం నేతృత్వంలో వరుస దాడులు నిర్వహించడంతో అక్రమ రేషన్ బియ్యం మాఫియా కొంతమేర వెనక్కి తగ్గిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు.ఇదే తరహాలో పెద్ద అంబర్పేట్, మంగళపల్లి ఇతర ప్రాంతాల్లో డిఎస్పి వెంకటేశం అదికారిచే ప్రత్యేకనిగా ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. వందలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకోవడం, అక్రమ రవాణా వాహనాలను పట్టుకోవడం, మాఫియాపై కేసులు నమోదు చేయడం వల్ల అక్రమ దందాకు గట్టి దెబ్బ తగిలిందని చెబుతున్నారు. అయితే ఇటీవల అలాంటి దాడులు తగ్గిపోవడంతో మాఫియా మళ్లీ చురుకుగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికంగా పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు లేదా ప్రైవేటు రైస్ మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లడమే కాకుండా నిజమైన లబ్ధిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నప్పటికీ స్థానిక స్థాయిలో నిఘా వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా సంబంధిత శాఖలతో పాటు స్థానిక పోలీసుల నిర్లక్ష్యం వల్లే మాఫియా ధైర్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిల్వ కేంద్రాలు,రవాణా మార్గాలపై రాత్రి సమయంలో నిరంతర నిఘా లేకపోవడంతో దందా యథేచ్ఛగా సాగుతోందని పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో పెద్ద అంబర్‌పేట్ నుంచి అమంగల్ వరకు,మంగళపల్లి బొంగులూరు గేట్ పరిసర ప్రాంతాల వరకు ప్రత్యేక సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ బృందాలు సమన్వయంతో ఆకస్మిక దాడులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేదా పిడి యాక్ట్ వెయ్యాలని, అక్రమ రవాణాకు వినియోగిస్తున్న గోదాములు, వాహనాలు, మధ్యవర్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇదే సమయంలో అక్రమ రేషన్ బియ్యం దందాను కట్టడి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే మాఫియా మళ్లీ తలెత్తిందని వారు విమర్శిస్తున్నారు.ప్రజాధనంతో కొనుగోలు చేసి పేదల కోసం కేటాయించిన రేషన్ బియ్యం అక్రమ మార్కెట్‌కు మళ్లిపోతే అది కేవలం చట్టవిరుద్ధ చర్య మాత్రమే కాదు,సామాజిక న్యాయానికి కూడా విఘాతం. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం,సివిల్ సప్లై శాఖ, టాస్క్‌ఫోర్స్, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు, ప్రజాసంఘాలు గట్టిగా కోరుతున్నాయి.


# 45 లక్షల చోరీ కేసులో కుషాయిగూడ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు..

**ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు నత్తనడకన.? -దొంగల కన్నా ఫిర్యాదుదారులపైనే ప్రశ్నల వర్షం..**

**సీసీటీవీ ఫుటేజ్‌లు ఉన్నా ముందుకు సాగని విచారణపై బాధితుల ఆవేదన..**

**సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు..**



FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500

1. District Malkajgiri P.S. Kushaiguda Year 2026 FIR No. 480/2026 Date 27-06-2026
2. Acts & Section(s): 305(a) BNS
3. a) Occurrence of Offence: Day Thursday Date & Time From 24-06-2026 08:00:00
Date & Time To 25-06-2026 18:30:00 Prior To Time Period 1
b) Information Received at P.S.: Date & Time 27-06-2026 20:00:00
General Diary Reference: Entry No 36 Date & Time 27-06-2026 20:00:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 2 kms, South Beat No. 1
b) Address Place At H.No. 1-2-28/1, Tirumala Nagar Area/Mandal Uppal Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
6. Complainant / Informant:
a) Name Sri. Nandra Sai Mahesh
b) Father's /Husband's Name Satyanarayana
c) Date/Year of Birth Age 26 Years
d) Nationality India e) Caste Reddy
f) Passport No Date of Issue Place of Issue
g) Occupation Mobile No. 9493919232
h) Address House No HB Colony, Moula Ali Area/Mandal Uppal Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No : 1
a) Name Varalakshmi
b) Father's /Husband's Name



**హైదరాబాద్,(ప్రజావినికిడి):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు రూ.45 లక్షల చోరీ జరిగిన కేసు దర్యాప్తు తీరుపై బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నెల 26వ తేదీన చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌లను కూడా అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, అసలు నిందితులను గుర్తించి సొమ్ము రికవరీ చేసే దిశగా దర్యాప్తు అసలు ముందుకు సాగడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

బాధితుల వివరాల ప్రకారం డిటెక్టివ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్‌లు చోరీకి పాల్పడిన వారిపై దృష్టి పెట్టకుండా, ఫిర్యాదుదారులనే పదేపదే పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇంత డబ్బు మీకు ఎలా వచ్చింది.? అనే ప్రశ్నలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాటికి సంబంధించిన ఆధారాలు సైతం చూపించామని అయినా పదేపదే దానికోసమే మాట్లాడుతూరని బాధితులు పేర్కొంటున్నారు. చోరీ జరిగిన డబ్బును రికవరీ చేయడం, నిందితులను గుర్తించడం వంటి ప్రాథమిక దర్యాప్తు అంశాలను పక్కనబెట్టి, ఫిర్యాదుదారులనే అనుమానితుల్లా ప్రశ్నించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు చేసిన లహరి,మహేష్ అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌లో దుర్భాషలాడడమే కాకుండా దాడి చేసినట్లు కూడా బాధితులు ఆరోపిస్తున్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వెళ్తే బాధితులకు ఇలానే చేస్తారా అని బోరున విలపిస్తున్నారు. మరో బాధితురాలు లహరి,రూ.45 లక్షలు పోయాయన్న ఆవేదనతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సీసీటీవీ ఫుటేజ్‌లలో అనుమానితుల కదలికలు ఉన్నప్పటికీ, వారిని శాస్త్రీయ పద్ధతుల్లో విచారించి సొమ్ము రికవరీ చేసే దిశగా కనీస చర్యలు కనిపించడం లేదని బాధితులు వాపోతున్నారు. "నిందితులు తామే చోరీ చేశామని ఒప్పుకోవడం లేదని, అందుకే రికవరీ చేయలేము" అని పోలీసులే చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని వారు పేర్కొంటున్నారు. నేరాన్ని ఛేదించడం పోలీసుల బాధ్యతే తప్ప,నిందితులు స్వయంగా ఒప్పుకుంటేనే కేసు పరిష్కారం అవుతుందా అని ప్రశ్నిస్తున్నారు.

న్యాయపరంగా చూస్తే,చోరీ జరిగిన కేసులో ముందుగా నిందితులను గుర్తించడం, సాక్ష్యాధారాల ఆధారంగా దర్యాప్తు పూర్తి చేయడం, దొంగిలించిన సొమ్మును స్వాధీనం చేసుకోవడం పోలీసుల విధి. అనంతరం ఆ సొమ్ముపై చట్టబద్ధమైన యాజమాన్యాన్ని నిర్ధారించి సంబంధిత ప్రక్రియ ద్వారా బాధితులకు అప్పగించడం జరుగుతుంది. అయితే ఈ ప్రక్రియను పక్కనబెట్టి, ఫిర్యాదుదారులనే పదేపదే విచారించడం వెనుక సీఐ వెంకటేశ్వర్లు ఉద్దేశం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై సీఐ వెంకటేశ్వర్లను వివరణ కోరగా, "సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కొందరిని ప్రశ్నించాం. అయితే వారు డబ్బు తీసుకున్నట్లు ఒప్పుకోవడం లేదు.అందువల్ల రికవరీ సాధ్యం కావడం లేదు"అని చెప్పినట్లు బాధితులు తెలిపారు. బాధ్యతాయుతమైన పోలీసు అధికారి నుంచి ఇటువంటి సమాధానాలు రావడం ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఉన్నత అధికారులేమో పోలీసు వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలి.ప్రజల సమస్యలు ఎలా తీర్చాలి అని ప్రయత్నిస్తుంటే కిందిస్థాయి అధికారుల తీరు ఇలా ఉండడంతో ప్రజలు పోలీస్ స్టేషన్ కు వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. రూ.45 లక్షలు అనేది భారీ చోరీకి సంబంధించిన ఫిర్యాదు కాబట్టి ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రత్యేక శ్రద్ధతో కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని, సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి రూ.45 లక్షల సొమ్మును రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు ఉప్పల్ జోన్ డీసీపీ, మల్కాజ్గిరి పోలీసు కమిషనర్‌ను కోరుతున్నారు.

# పార్టీలకతీతంగా సిద్దాపూర్ ఉద్యమం..

## డంపింగ్ యార్డును అడ్డుకునేందుకు సమిష్టి పోరాటానికి పిలుపు.. - షాద్‌నగర్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం..













**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
సిద్దాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటును అడ్డుకునేందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, మీడియా ప్రతినిధులు కలిసి సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.

లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాంబల్ నాయక్ అధ్యక్షతన బుధవారం షాద్‌నగర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్,బీజేపీ, బీఎస్పీ,సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, మేధావులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్, డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కే. నరేందర్,బీఎస్పీ నేత దొడ్డి శ్రీనివాస్, సీపీఎం నేత ఈశ్వర్ నాయక్, కార్మిక నేత పినపాక ప్రభాకర్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈటా గణేష్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులు మాట్లాడుతూ, సిద్దాపూర్ సమస్యను రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలతో పక్కదారి పట్టించకుండా ప్రజా సమస్యగా తీసుకుని ఐక్యంగా పోరాడాలని సూచించారు.

వై.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, సమస్య పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. అవసరమైతే ఈ ఉద్యమానికి కేటీఆర్,హరీష్ రావు మద్దతు కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని,ఏ వేదికకు పిలిచినా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, సిద్దాపూర్ ఉద్యమం రాజకీయ వివాదాల్లో చిక్కుకోకుండా ముందుకు సాగాలని సూచించారు. ఉద్యమంతో పాటు న్యాయపోరాటం, గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడం వంటి చర్యలు కూడా చేపట్టాలని అభిప్రాయపడ్డారు.

దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ,ఇది ఇద్దరు నాయకుల మధ్య వ్యక్తిగత వివాదం కాదని, ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని శాసనసభ,శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కారం చూపాలని కోరారు.

రాజా వరప్రసాద్ మాట్లాడుతూ, ఫోర్త్ సిటీ పేరుతో వేలాది ఎకరాల భూములను అభివృద్ధి పేరుతో వినియోగిస్తూ, డంపింగ్ యార్డును షాద్‌నగర్‌పై మోపడం అన్యాయమని విమర్శించారు. "సేవ్ షాద్‌నగర్" ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.అందే బాబయ్య మాట్లాడుతూ, సిద్దాపూర్ ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రాంత అభివృద్ధిని దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రజలతో కలిసి వ్యతిరేకిస్తామని తెలిపారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు ఏర్పాటుతో సుమారు 30 గ్రామాలు,8 తండాల ప్రజల జీవన విధానం తీవ్రంగా ప్రభావితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఉద్యమంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

సమావేశంలో పలువురు నాయకులు ఎమ్మెల్సీ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను తప్పుబడుతూ, ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత విమర్శలు, బెదిరింపులకు తావు లేదన్నారు. ఉద్యమాన్ని బలహీనపరిచే చర్యలను పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.చివరగా రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణను రూపొందించి, సిద్దాపూర్ డంపింగ్ యార్డు ఏర్పాటును అడ్డుకునేందుకు సమిష్టిగా పోరాడాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది.

# నవీన్ రెడ్డి.. నీ "నీచ చరిత్ర" అందరికీ తెలుసు..!

- నీకు జతగా "లోకల్ కేఏ పాల్ " కుట్రలు తెలుసు
- సిద్ధాపూర్ లో పేదలకు భూములు పంచింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- అవి లాక్కున్నది బిఆర్ఎస్ ప్రభుత్వం
- 2018లోనే పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు బిఆర్ఎస్ పునాది
- భూ సేకరణకు అప్పట్లో టీఎస్ఐఐసి ఉత్తర్వులు
- సిద్ధాపూర్ లో 233-10 ఎకరాల భూసేకరణకు ఉత్తర్వులు జారీ చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమే
- 80 ఎకరాలు రైతుల బినామీ పేర్లతో రూ.9 కోట్లకు పైగా తీసుకున్నది నీ పార్టీ వాళ్లు కదా..?
- కనీసం 50 రూపాయల ముడుపులు ముట్టుకున్నట్టు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా
- షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" సవాల్
- ఉదయం 10 గంటలకే షాద్ నగర్ చౌరస్తాకు భారీగా చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు
- సిద్ధాపూర్ పై అఖిలపక్షం వేయండి అండగా ఉంటా..
- సిద్ధాపూర్ కు రాకుండా చేసే బాధ్యత నాదే అంటూ ఎమ్మెల్యే ఉద్ఘాటన..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నేను అట్టడుగు వర్గాల నుండి రాజకీయంగా ఎదుగుతూ మండల పార్టీ ప్రెసిడెంటుగా గ్రామ సర్పంచుగా ఆ తర్వాత ఎమ్మెల్యేగా ప్రజల మన్ననలతో ఈ స్థాయికి ఎదిగానని అట్టడుగు వర్గాల నుండి ఎన్నో కష్టాలకు గురై ఈ స్థాయికి చేరుకుంటే అది చూసి ఓర్చుకోలేక నియోజకవర్గంలో ఇద్దరు నాయకులు జతై నాపై లేనిపోని విమర్శలు చేస్తూ అక్రమ ఆరోపణలు అంటగడుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని వారి చరిత్ర ఏమిటో నియోజకవర్గ ప్రజలకు తెలుసని, వారి నీచ చరిత్రను కడిగేందుకు ప్రజలే త్వరలో సిద్ధంగా ఉంటారని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి నిన్న మీడియా ముందు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వాస్తవాలను చర్చించేందుకు రావాలని నవీన్ రెడ్డికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటలకే చౌరస్తాకు చేరుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మద్దతుగా తరలి వచ్చారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర నాయకులు మీడియాతో మాట్లాడారు. సొంత పార్టీలోనే నీచ రాజకీయాలకు బుద్ధి చెబుతున్నారని అదంతా తమకు తెలుసని వివరించారు.

### నీ నీచ చరిత్ర ఎవరికీ తెలియనిది..

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నిన్న మీడియా ముందు తనపై చేసిన ఆరోపణలు విమర్శలను స్వీకరించి ఇక్కడికి వచ్చానని, వాస్తవాలు ఏమిటో తాను చెప్పేందుకు వచ్చానని,నీతి నిజాయితీ దమ్ముంటే తనపై చేసిన 50 కోట్ల ముడుపుల ఆరోపణలను సాక్షాదారాలతో సహా నిరూపించాలని సవాల్ విసిరారు. తాను ఏ స్థాయి నుండి ఈ స్థాయికి వచ్చానో నియోజకవర్గ ప్రజలకు అందరికీ తెలుసని నీ చరిత్ర ఏమిటో కూడా ప్రజలకు తెలుసని అన్నారు.నీకు జతగా మరో లోకల్ కేఏ పాల్ జతై మీరు ఆడుతున్న డ్రామా అందరికీ తెలుసని అన్నారు.

సదరు లోకల్ కెఏ పాల్ గత అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు పట్టగొలుసులు పంచుతానని చెప్పి మోసం చేశాడని గ్రామాల్లోకి వెళితే మహిళలు పట్టగొలుసులు అడుగుతున్నారని వీటిని తాము ప్రశ్నిస్తే సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకొని ఆటలాడుతున్నారని ఎమ్మెల్యే శంకర్ ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్,బిజెపి నాయకులు ఇద్దరు తోడై సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారాన్ని నడిపిస్తూ ప్రభుత్వంపై ఆందోళనలు ఉధృతం చేసే విధంగా తప్పుడు పద్ధతులతో కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్యే అన్నారు.

### మీకు దమ్ముంటే ఇది తెలుసుకోండి..

2018 సంవత్సరంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ వెలుపల పారిశ్రామిక ప్రాంతాన్ని ఏర్పాటు చేసి నగరంలో కాలుష్యం లేకుండా సిద్ధాపూర్ ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం మొదలుపెట్టిందన్నారు. 2018 సంవత్సరం 9 ఆగస్టులో అప్పటి టిఎస్ఐఐసి జోనల్ మేనేజర్ 233 ఎకరాల 10 గుంటల భూమిని భూసేకరణ కోసం ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పి శంకర్ రావు హయాంలో సిద్ధాపూర్ ప్రాంతంలో ఇచ్చిన ప్రభుత్వ అసైన్ భూములను గత ప్రభుత్వం లాక్కుని ఈ ఉత్తర్వుల ద్వారా అక్కడ పారిశ్రామిక ప్రాంతాన్ని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. పేద ప్రజల వద్ద భూములు లాక్కొని ఆ భూములను అలాగే ప్రభుత్వం తన వద్ద జనరల్ గా ఉంచుకుందని అన్నారు.గత ప్రభుత్వం ఆలోచన విధానాలతోనే పారిశ్రామిక ఏర్పాటులో భాగంగా డంపింగ్ యార్డ్ కాకుండా ఎకో పార్కు నిర్మాణానికి ప్రభుత్వం జీవో 641ఇచ్చిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుకు సంబంధించిన సాక్షాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.

### మీ అవినీతి నిరూపిస్తాం రాజీనామా చేస్తావా..? ముక్కు నేలకు రాస్తావా..?

సిద్ధాపూర్ భూముల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం భూములను పేదల నుండి లాక్కొని ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం నాయకుల చేతిలో పెట్టిందని తద్వారా భూముల పరిహారం పేరిట కొందరు బినామీలు రైతుల అవతారం ఎత్తి కోట్ల రూపాయలు కొల్లగొట్టి అందమైన భవంతులు కట్టుకున్నారని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. దానికి సంబంధించిన ప్రభుత్వ దర్యాప్తు కొనసాగుతుందని ఎవరైతే అక్రమాలకు పాల్పడ్డారో వారి ఆస్తులను అటాచ్ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

దాదాపు 80 మంది నకిలీ రైతుల పేరిట 9 కోట్లకు పైగా అక్రమంగా ప్రభుత్వ డబ్బులు తీసుకున్నది బిఆర్ఎస్ నాయకులు కాదా ? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.వాళ్లే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పక్కన నిలబడి నిన్న ఆందోళన చేయలేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అక్రమార్కులను అవినీతిపరులను మీ వెంట పెట్టుకుని నన్ను ముడుపులు తీసుకున్నామంటూ మాట్లాడడం ఒక ప్రజాప్రతినిధిగా ని స్థాయికి సరిపోదని ఎమ్మెల్యే అన్నారు. 9 కోట్లకు పైగా డబ్బులు ఎలా కొల్లగొట్టి జేబుల్లో వేసుకున్నారో వాటికి సంబంధించిన సాక్షాదారాలు కూడా మీరు కోరితే ఇస్తామని అన్నారు. చౌకబారు మాటలు మానుకోవాలని సూచించారు.

### అఖిలపక్షంగా రండి అండగా ఉంటా..

సిద్ధాపూర్ గ్రామ సమస్యపై పార్టీలకు అతీతంగా రాజకీయాలు లేకుండా ఎవరి స్వార్థం ఉండకుండా రైతుల కోసం ప్రజల కోసం నిలబడేవారు అఖిలపక్షంగా అన్ని పార్టీలతో కలిసి ఏర్పడితే తను కూడా వారితో కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సిద్ధాపూర్ అంశంలో కొందరు స్వార్ధ నాయకులు తమ అవకాశవాద రాజకీయాల కోసం వాడుకుంటున్నారని అలా కాకుండా ఈ సమస్యను పరిష్కరించడం తన బాధ్యతని తాను ఇక్కడి ప్రజలకు రుణపడి ఉన్నానని డంపింగ్ యార్డ్ లేదా ఏకో పార్క్ ఏదైనా సరే రాకుండా అడ్డుకునే సత్తా తన వద్ద ఉందని ఇందులో ఎలాంటి అనుమానాలు లేవని,తాను ఎల్లప్పుడూ ప్రజాపక్షమే అని ఎమ్మెల్యే శంకర్ ఉద్ఘాటించారు. ఎవరెన్ని రాజకీయ కుట్రలు చేసిన,ఏం చేసినా తాను కూడా ప్రజాపక్షమే అని తన వెంట సమస్య పరిష్కారం కోసం నడిచే వారికి ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని అన్నారు.ప్రజలు రైతులు మేధావులు వాస్తవాలను గ్రహించాలని సమస్యను పక్కదారి పట్టించకుండా విజ్ఞతతో ఆలోచించాలని తాను డంపింగ్ యార్డ్ కు పూర్తిగా వ్యతిరేకమని మరోసారి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిద్ధాపూర్ నాయకులు అంబటి ప్రభాకర్, శేఖర్ రెడ్డి, రఘునాయక్, కృష్ణారెడ్డి,బాబర్ ఖాన్,ఆయా మండలాల అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, రమేష్, చంద్రశేఖర్, కుమార్ గౌడ్, శేఖర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందేమోహన్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఇద్రిస్,స్థానిక కౌన్సిలర్లు,వివిధ అనుబంధ సంఘాల నాయకులు జాంగారి రవి,శీను నాయక్, ముబారక్ అలీ ఖాన్,సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, సర్పంచులు గోపాల్ రెడ్డి, బాబు నాయక్,ఉప సర్పంచ్ అశోక్ అదేవిధంగా అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు మహిళ నాయకురాలు అనసూయ,పిట్టల రజిత తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో 8.50 లక్షల కోట్లు అప్పుచేస్తే..

# కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో 8 లక్షల ఇళ్లు మంజూరు చేశాం..

**కాంగ్రెస్ ప్రభుత్వ ప్రగతి చూసి బిఆర్ఎస్ నేతలకు పిచ్చెక్కింది.. -వనపర్తి , గద్వాల నియోజకవర్గాల్లో ప్రగతి పనులకు శ్రీకారం..**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**

**హైదరాబాద్, (ప్రజావినికిడి):** రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయిల అప్పును ప్రజలపై మోపితే నేటి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో ఎనిమిది లక్షల ఇళ్లను మంజూరు చేసిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిస్పష్టం చేశారు.తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు రెండున్నర లక్షల ఇళ్లు,క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లతో కలిపి మొత్తం ఎనిమిది లక్షల ఇళ్లను నిర్మిస్తోందని వివరించారు.



వనపర్తి,గద్వాల జిల్లాల్లో బుధవారం సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకీటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యేలు మేఘా రెడ్డి కృష్ణారెడ్డిలతో కలిసి తహశీల్దార్ కార్యాలయ భవనం, వెంకటేశ్వర ఆలయాలకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పేదలకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి దివంగత నేత రాజశేఖరరెడ్డి 77వ జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత ప్రభుత్వం మాదిరిగా తాము ప్రజలను మోసపుచ్చకుండా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఒక్క రూపాయి లంచం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణకార్యక్రమాలు సాగుతున్నాయని గుర్తు చేశారు.తొలి విడత మంజూరు చేసిన ఇళ్లలో ఇప్పటికే 1.35 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు జరిగాయని మరో 1.25 లక్షల ఇళ్లు శ్లాబులను పూర్తి చేసుకోగా మిగిలిన ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. రెండవ విడత ఇళ్ల మంజూరు ప్రతి నియోజకవర్గానికి 1500 ఇళ్లతో పాటు పూరి గుడిసెల స్థానే పక్కా ఇళ్ల కోసం 500 చొప్పున మంజూరు చేశామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగతున్న ప్రగతిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు రోడ్లపై పడి విషం చిమ్ముతున్నారని, మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈనెల 10 ఖమ్మం జిల్లాలో రైతులకు 9300 కోట్ల రూపాయిల విడుదలకు సంబంధించి కార్యక్రమం జరుగుతుందని నాడు వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ మాటలకు భిన్నంగా నేడు రైతే రాజు అనే నినాదంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వనపర్తిని దత్తత తీసుకుంటానని గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి



ఉన్నానని మంత్రి పొంగులేటి వివరిస్తూ ఇక్కడ ప్రెస్ క్లబ్ కు భవనాన్ని,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.
రాష్ట్రంలో సుమారు 32వేల పూరి గుడిసెలు ఉన్నట్లు గుర్తించామని వనపర్తి నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె లేకుండా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునే పేదలకు ఇసుక, మట్టి సేకరణ విషయంలో ఎటువంటి ఆటంకం కలిగించవద్దని పోలీసు,రెవెన్యూ, హౌసింగ్ అధికారులకు సూచించారు. సాదాబైనామాలకు సంబంధించి రైతు పొజిషన్ లో ఉంటే వాటిని రెగ్యులరైజ్ చేయాలని దీనికి సంబంధించి అవసరమైతే సిసిఎల్ఏ అనుమతి తీసుకోవాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు.





## ఆర్టీసీ విలీనం చేసే వరకు పోరాటం

**శంకర్ గౌడ్ సంస్మరణ సభలో తలసాని**



**హైదరాబాద్,జూలై8(ప్రజావినికిడి)::** ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు ముగిశాకే ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేనని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డ్రైవర్ శంకర్ గౌడ్ సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శంకర్ గౌడ్ కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసమే శంకర్ బలిదానం జరిగిందని పేర్కొన్నారు. వేలాదిమంది ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరుగుతుందని ప్రాణత్యాగం చేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికులలో ఐక్యత లేని కారణంగా ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.శంకర్ గౌడ్ కుమారునికి ఉద్యోగం కల్పించడంలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం పక్రియ కేసీఆర్ ప్రభుత్వంలోనే పూర్తయిందని, అపాయింటెడ్ డేను ప్రభుత్వం ప్రకటించడమే మిగిలి ఉండగా ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు.

## గురుకుల విద్యార్థుల ఆరోగ్యం,భద్రతపై అప్రమత్తం

**వర్షాకాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు -పారదర్శక అడ్మిషన్ల పక్రియ నిర్వహించాలి**

**నాణ్యమైన బోధనకు పటిష్ట చర్యలు చేపట్టాలి -సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**హైదరాబాద్,జూలై8(ప్రజావినికిడి):**



తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు, వేడి నీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షాకాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... గురుకులాల్లో ప్రవేశాల పక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో నిబంధనల ప్రకారం తాత్కాలిక నియామకాలు చేపట్టి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుందని, ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళిక అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన వేడి నీరు అందుబాటులో ఉంచాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నీటి ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. నీటి నాణ్యతను పరీక్షించి, అవసరమైన చోట వాటర్ ప్యూర్గి÷యైర్లు, క్లోరినేషన్, ఫిల్టరేషన్ సదుపాయాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు.

## 20 నుంచి 22 వరకు బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

**అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలపై మంత్రి సురేఖ సమీక్ష**

**హైదరాబాద్,జూలై 8 (ప్రజావినికిడి):**
నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేయాలని ఆధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జులై 20 నుంచి 22 వరకు ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలు జరుగుతాయని వివరించారు. జులై 20 సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.బల్కంపేట ఎల్లమ్మ దర్శనం అష్టాదశ శక్తిపీఠాల దర్శనంతో సమానమని భక్తుల విశ్వాసం అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బోనాల జాతర, కళ్యాణోత్సవ పోస్టర్లను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జులై 21న వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి



కళ్యాణోత్సవం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. జులై 22న సాయంత్రం ఘనంగా రథోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులు, సిబ్బందిని మంత్రి ఆదేశించారు.వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సేవలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు సురేఖ. పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని అన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరిశుభ్రత, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్పష్టం చేశారు. వైద్య శిబిరాల ఏర్పాటు, 108 అంబులెన్స్‌లతోపాటు అత్యవసర వైద్య బృందాలనూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు.

# మతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం

**హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు -వారికి జగన్ వత్తాసు పలకడం మరీ దారుణం**

**మండిపడ్డ మంత్రులు ఆనం, సత్యకుమార్ యాదవ్**

**అమరావతి, జూలై 8:(ప్రజావినికిడి):**
భారతీయులు, హిందువుల మనోభవాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్న వారిని జగన్ సమర్థించడం, చిచ్చు పెట్టేలా చేయడం దారుణమని ఎపి మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఇలాంటి నీచానికి దిగజారుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వారిని గొడ్డలి పార్టీ సమర్థించడం భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ రాజ్యాంగానికి పెడర్థాలు తీసి ప్రజల మనోభవాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజాన్ని తమవైపు తిప్పుకోవడానికి మత విద్వేషాలు రెచ్చగొడతారా అని మంత్రి ఆనం ప్రశ్నించారు. ఒక వ్యక్తి రావణ్ పేరుతో హిందువుల మనోభవాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ పీఠాధిపతులను కూడా విమర్శించే స్థాయికి జగన్ అండ్ కో వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని రాజారెడ్డి రాజ్యాంగంలో రాసుకున్నారా? అని ప్రశ్నించారు. సామాన్యుల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న జగన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 19(1ఏ) భావస్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ కల్పించినట్లే... మత విశ్వాసాలను, స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని మంత్రి ఆనం తెలిపారు. రాజ్యాంగం ఇవ్వని భావ



ప్రకటన స్వేచ్ఛ తమకుందని చెప్పుకుంటూ అనేక వర్గాలను, మతాలను వేరు చేయాలని జోసఫ్ రావణ్ అనే వ్యక్తి ద్వారా జగనే చేయిస్తున్నారని ఆరోపించారు. మతాలను అగౌరవపరచమని ఏ రాజ్యాంగం చెప్పిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చట్టాలు తన పని తాను చేసుకోవాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. రాజకీయంగా సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషాలు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్‌లు పంపుతూ



విద్వేషాలు రేకిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసేలా కుట్రపూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకుపడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని.. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# కాళేశ్వరం కథ కంచికి చేరేదెలా ?



**జూలై 8 (ప్రజావినికిడి):**
కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పడని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ కేవలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్దంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగిం చుకునే శక్తి ఉంటుందా లేద అన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్ధిని చాటుకోవాలి. కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నారు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షించడం కూడా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటికే ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. గోదావరిలో ఇప్పుడే కొద్దిగా న ఈరు వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగ ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు. నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లాయో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యం అయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ అబద్దాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.

# గల్లంతయిన మత్స్యకార కుటుంబాలకు భరోసా

**పదిలక్షల చొప్పన పరిహారం అందించిన మంత్రి కొల్లు -గల్లంతయిన వారి జాడ తెలియక కుటుంబాల్లో విషాదం**



**విశాఖపట్నం,జూలై 8 (ప్రజావినికిడి):**
విశాఖ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది.
బుధవారం మృతుల కుటుంబాలకు మంత్రి కొల్లు రవీంద్ర చెక్కులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఐదు లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఐదు లక్షలను అందజేశారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు మత్స్యకారుల కుటుంబాలకు అందించి నట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కూడా మత్స్యకారులకు ఇవ్వాల్సిన 63 క్లెయిమ్స్ పెండింగ్‌లో పెట్టారన్నారు. రూ.3.15 కోట్లను కూడా ఈరోజు క్లియర్ చేశామన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన డిపార్ట్‌మెంట్‌లతో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని మంత్రి కొల్లురవీంద్ర పేర్కొన్నారు. మరోవైపు మంత్రి రాకను మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా నిరసించాయి. తమవారిని రక్షించకుండా ఎందుకు వచ్చారని నిలదీశారు. ఇకపోతే సముద్ర జలాల్లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు చెందిన మహిళలను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. చేపలరేవులోని బోటు ఆపరేటర్ల సంఘం కార్యాలయంలో తమ వారి రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూనే ఉన్నారు. బోటు యజమాని కారి చిన్న సురక్షితంగా బయటకు వచ్చి తన కళ్ల ఎదుటే సహచరులు మునిగిపోయారని చెప్పడంతో వారిలో ఆందోళన మరింత తీవ్రమైంది. ఇంటి పెద్దల జాడ తెలియకపోవడంతో పిల్లలతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలంటూ హృదయవిదారకంగా రోదిస్తున్నారు. కొందరు కడసారి చూపులకు నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ వచ్చిన సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని.. ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని.. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని వారంతా కోరారు.
చేపల రేవుకు పది నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదంలో చిక్కుకున్న సమాచారాన్ని వారి కుటుంబసభ్యులు ఈ నెల 4న సాయంత్రం 4 గంటల సమయంలో మత్స్యకార సంఘాల నేతలకు తెలియజేసినప్పటికీ ఆ విషయం మత్స్య శాఖ అధికారుల దృష్టికి రాత్రి 10.10 గంటల వరకు వెళ్లలేదు. ఈలోపు నష్టం జరిగిపోయింది. మత్స్యకారులు సమాచారమివ్వగానే అధికారులకు తెలియజేసి ఉంటే సెర్చింగ్ ఆపరేషన్ అదే రోజు సాయంత్రం ప్రారంభమయ్యేది. రాత్రి 9 గంటల వరకు బోల్తా పడిన బోటుపై సాయం కోసం మత్స్యకారులు ఎదురుచూశారు. పడవ మునిగిపోతుండటంతో సముద్ర జలాల్లో ఈత కొడుతూ ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. తమకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి వస్తున్నామని సమాచారం వచ్చిందని.. 4 గంటల సమయంలో ప్రమాదంలో చిక్కుకున్నారని భావించి మత్స్యకార సంఘాల నాయకులకు తెలియజేసినట్లు మత్స్యకార మహిళలు చెప్పిన విషయాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మత్స్య శాఖ డీడీకి విషయం తెలియగానే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో కోస్టుగార్డును అప్రమత్తం చేశారు. నౌకలు కాకినాడలో ఉండటంతో ఆదివారం ఉదయం నుంచి గాలింపు చర్యలు మొదలయ్యాయి. మత్స్యకారులు సమాచారం ఇచ్చిన వెంటనే అధికారులకు తెలియజేస్తే మెరుగైన ఫలితాలు ఉండేవని.. సమాచార లోపంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# స్టాక్ మార్కెట్లలో ఒక్కరోజే రూ. 8 లక్షల కోట్లు ఆవిరి!



**జూలై 8 ((ప్రజావినికిడి):**
అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సూచీలు భారీగా కుప్పకూలడంతో ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజే సుమారు రూ. 8 లక్షల కోట్లు ఆవిరైంది. అమ్మకాల సునామీ కారణంగా బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 2 శాతానికి పైగా నష్టపోయాయి.ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,677 పాయింట్లు నష్టపోయి 76,503.60 వద్ద ముగిసింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 517 పాయింట్లు పతనమై 23,882.05 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్ సహా అన్ని రంగాల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి.
ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అంతర్జాతీయంగా మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. హార్ముజ్ జలసంధిలో చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే భయాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర సుమారు 5 శాతం పెరిగి 78 డాలర్లకు చేరుకుంది.ఈ పరిణామాలు భారత కరెన్సీపైనా తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.50 స్థాయిని దాటి బలహీనపడింది. పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణ ఆందోళనలను పెంచాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఇటీవలి లాభాలన్నీ ఈ ఒక్క సెషన్‌లోనే తుడిచిపెట్టుకుపోయాయని ఆయన పేర్కొన్నారు.

# ఇప్పుడు అయోధ్య..గతంలో వారణాసి

**దేవుళ్లకే పంగనామాలు పెట్టిన దగుల్బాజీలు**

**హిందువుల విశ్వాసాలను దెబ్బతీసిన దౌర్భాగ్యులు**



**వారణాసి,జూలై 8 (ప్రజావినికిడి):** ఆలయంలో దోపిడీ అంటే భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దోచుకోవడమే. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది. శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.

--------------------

# ఎస్సీలను పావులుగా వాడుకుంటున్నారు

**రాజకీయ నేతల తీరుపై మండిపడ్డ మాధవ్**



**విజయవాడ,జూలై 8(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని.. ఎస్సీలను పావులుగా వాడుకుని రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరినైనా ఏది పడితే అది మాట్లాడొచ్చని అనుకుంటున్నారని.. హిందూ దేవతలను తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడిన తర్వాత అరెస్టు చేస్తే హక్కుల ఉల్లంఘన అంటున్నారన్నారు. సినిమా తారలు, యూట్యూబర్స్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వీరిపై ఎందుకు దేశద్రోహం కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. ఉపా చట్టం కింద కేసులు ఎందుకు పెట్టకూడదో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎస్సీలను వాడుకుంటున్నారని ఆరోపించారు. విదేశీ శక్తులు కూడా కుట్రలో పాలు పంచుకుంటున్నాయన్నారు. విద్రోహ కార్యకలాపాలు చేసే వాళ్లు అందరూ ఇక్కడకు చేరుకుంటున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును ఉద్దేశించి పలువురు సభలు పెట్టి మాట్లాడుతున్నారని అన్నారు. ఏపీలో పెద్ద నాటకం జరుగుతోందని మాధవ్ అన్నారు. జోసెఫ్ తన పేరును రావణ్ అని మార్చుకున్నారని తెలిపారు. హిందువులపై విషం కక్కుతున్నారని వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహ శక్తులను రాష్ట్రంలో తిరగనివ్వకూడదని మాధవ్ పేర్కొన్నారు.

# జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు




**విజయవాడ,జూలై 8 (ప్రజావినికిడి):** జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రవణ్ కుమార్‌పై ఐటీ శాఖకు ఫిర్యాదు అందింది. జడా శ్రవణ్ కుమార్ ఆదాయపన్ను ఎగవేశారంటూ కారంపూడి జానకి సుమంత్ ఐటీ శాఖకు ఫిర్యాదు చేశారు. జడా శ్రవణ్ కుమార్‌పై బినామీ ఆస్తుల చట్టంతో పాటు ఆదాయపన్ను చట్టం కింద క్రిమినల్ చర్యలు చేపట్టాలని సుమంత్ తన ఫిర్యాదులో కోరారు. కాగా, మత విద్వేషాలు, వైషమ్యాలు రగిలిస్తూ, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని అందిన ఫిర్యాదు మేరకు కొద్దిరోజుల క్రితం జై భీమ్ భారత్‌పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్‌తోపాటు మరికొందరిపై ఏలూరు త్రీ టౌన్, కాళ్ల పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను వ్యక్తిగతంగా దూషించి హేళన చేశారని ఏలూరు గొల్లాయిగూడానికి చెందిన పెద్దాడ వెంకటరమణ, కాళ్ల మండలం సీసలికి చెందిన తోట ఫణిబాబు ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు, పాలకోడేరు పోలీసు స్టేషన్లలోనూ శ్రవణ్ కుమార్‌పై ఫిర్యాదులందాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

# రాకాను వదులుకున్న ప్రీతి ముకుందన్

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ చిత్రంలో నటించే అవకాశాన్ని ప్రీతి ముకుందన్ వదులుకున్నట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై అట్లీ స్పందించారు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. నేను ప్రీతి నటనకు పెద్ద అభిమానిని. నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం మొదట ఆమెనే సంప్రదించాను. అప్పటికే ఆమె బిజీగా ఉండటంతో మాకు డేట్స్ కేటాయించలేక పోయింది. దీంతో ఈ ప్రాజెక్టును ఆమె వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రీతి రిజెక్ట్ చేసిన ఈ కీలక పాత్రను మలయాళ నటి ఫెమినా జార్జ్‌కు ఆఫర్ చేసినట్లు అట్లీ స్పష్టం చేశారు. ఆ పాత్రకు సంబంధించిన వివరాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. 'కన్నప్ప'తో ఇండస్ట్రీకి పరిచయమైన ప్రీతి ముకుందన్ ఇటీవల 'బ్లాస్ట్'తో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు తమిళ రొమాంటిక్ కామెడీ 'హృదయం మురళి'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. జులై 10న విడుదల కానుంది.






# 'టాక్సిక్' నుంచి తొలి పాట విడుదల

యశ్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్' నుంచి 'తబాహి' పేరుతో తొలి వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. పాటలో యశ్, కియారాల జోడీ, వారి మధ్య చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. విజువల్స్ పరంగా పాట బాగుందని చెప్పచ్చు. ఈ పాట తెలుగు వెర్షన్‌కు ప్రముఖ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు.

గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి భారీ తారాగణం నటిస్తోంది. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి సంగీతం అందిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై యశ్ స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## ఎమోషనల్ రొమాంటిక్ డ్రామా..

# హృదయ మురళి




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' . ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా కనిపసించడం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## నవీన్ పోలిశెట్టి సినిమాకు

# తమిళ దర్శకుడు

ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో నవీన్ పొలిశెట్టి. ఇది ఆయన కెరీర్‌లో రూ.100కోట్ల వసూళ్ల సాధించిన తొలి సినిమాగా పేరు తెచ్చుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఆయనతో ఓ సినిమా చేయబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం ఓ తమిళ దర్శకుడితో చేతులు కలుపుతున్నట్లు తెలిసింది. 'సైరన్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన ఆంటోని భాగ్యరాజ్‌తో తను కలిసి పని చేయనున్నట్లు సమాచారం. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రంపై స్పష్టత వచ్చే అవకాశముంది.





# సుకుమార్ స్కూల్ నుంచి మరో దర్శకుడు

### బాబీ దర్శకత్వంలో సిద్ధూ జొన్నలగడ్డ



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ కేవలం విజయవంతమైన సినిమాలు తెరకెక్కించడమే కాకుండా, ఇండస్ట్రీకి పలువురు ప్రతిభావంతులైన దర్శకులను అందించిన గురువుగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన వద్ద శిష్యరికం చేసిన అనేక మంది దర్శకులు ప్రస్తుతం టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మరో కొత్త దర్శకుడు చేరనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. సుకుమార్ సోదరుడి కుమారుడు బాబీ త్వరలో దర్శకుడిగా పరిచయం కానున్నారు. గత కొంతకాలంగా సుకుమార్ వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాబీ.. ఆయన సినిమాలతో పాటు పలు ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తి స్థాయి దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో రూపొందనున్న తొలి చిత్రంలో యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కథను సిద్ధుకు వినిపించగా, ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సుకుమార్ క్యాంప్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడం, కథ కూడా నచ్చడంతో సిద్ధు ఈ సినిమాకు అంగీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుకుమార్ వద్ద పనిచేసిన శిష్యుల తొలి చిత్రాలు ఎక్కువగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లోనే రూపొందాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బాబీ తొలి సినిమాను కూడా సుకుమార్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇది విధి నిర్ణయం

## శ్రీలీల గురించి భాగ్యశ్రీ కామెంట్స్ వైరల్!

అఖిల్ అక్కినేని హీరోగా మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన లెనిన్ రిలీజ్ కు రెడీ అవుతున్న వేళ, సినిమా చుట్టూ ఆసక్తికరమైన విషయాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌తో మంచి బజ్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన భాగ్యశ్రీ బోర్సే తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మొదట శ్రీలీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, అవకాశాన్ని భాగ్యశ్రీ బోర్సే అందుకుంది. ఈ నేపథ్యంలో శ్రీలీల చేయాల్సిన సినిమా మీకు రావడం అదృష్టంగా భావిస్తున్నారా? అనే ప్రశ్నకు భాగ్యశ్రీ ఎంతో పరిణితితో స్పందించిందిప్రతి కథ అందులో ఎవరు నటించాలో ముందే నిర్ణయించుకుంటుందని, ఒక పాత్ర ఎవరికి దక్కాలో అది విధే నిర్ణయిస్తుందని, లెనిన్ లో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఈ అవకాశం రావడం వెనుక కూడా ఆ డెస్టినీనే ఉందంటూ ఆమె చెప్పిన మాటలు ఆకట్టుకుంటున్నాయి. మరో హీరోయిన్ చేయాల్సిన పాత్ర తనకు రావడంపై ఎలాంటి పోలికలు లేకుండా, కథపై నమ్మకంతో ఆమె ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటోంది. ఇక భాగ్యశ్రీ కెరీర్ పరంగా చూస్తే లెనిన్ చాలా కీలకమైన సినిమా. గత కొంతకాలంగా ఆమె నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ లు అందుకోలేదు. దీంతో ఈ సినిమా ఆమెకు తప్పనిసరిగా హిట్ కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా టాలీవుడ్ లో నిలదొక్కుకోవాలంటే ఈ సినిమా రిజల్ట్ ఆమె కెరీర్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే లెనిన్ రిలీజ్‌కు ముందే భాగ్యశ్రీకు మంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడం విశేషం. టీజర్, ట్రైలర్‌లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్, అఖిల్‌తో కెమిస్ట్రీ ఆడియన్స్ ను ఆకట్టుకున్నాయి. సోషల్ మీడియాలో కూడా ఆమె లుక్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా రిలీజ్ తర్వాత ఆమె క్యారెక్టర్‌కు మంచి గుర్తింపు వస్తే, టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే టీమ్ చేస్తున్న ప్రమోషన్స్ లెనిన్‌పై అంచనాలను మరింత పెంచాయి. అఖిల్ కెరీర్‌లో ఈ సినిమా ఎంత కీలకమో, భాగ్యశ్రీ కెరీర్‌కు కూడా లెనిన్ అంతే ముఖ్యమైన ప్రాజెక్ట్‌గా మారింది. డెస్టినీ తనను ఈ సినిమాకు తీసుకొచ్చిందని చెప్పిన భాగ్యశ్రీకి, అదే డెస్టినీ సక్సెస్ ను కూడా అందిస్తుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. జులై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న లెనిన్ రిజల్ట్ అఖిల్‌తో పాటు భాగ్యశ్రీ సినీ కెరీర్ కు కూడా కొత్త మలుపు తీసుకురానుందేమో చూడాలి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613